పార్సిల్ సదుపాయం కలదు
Hotel New BLUE EARTH The Pearl
Multi Cuisine Restaurant & Function Halls
ప్రతీ సాయంత్రం రుచికరమైన వెరైటీ వంటకాలతో వేడివేడిగా టిఫిన్స్ అందుబాటులో
ఫారెస్ట్ ఆఫీస్ ఎదురుగా, డే & నైట్ జంక్షన్, శ్రీకాకుళం



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

20 YEARS ANNIVERSARY

సోమవారం 2-6-2025

సంపుటి: 21 సంచిక: 59
పేజీలు: 8 వెల: రూ.1



జన్మదిన శుభాకాంక్షలు
మా శ్రేయోభిలాషి, సహచర ఇంజినీర్ హారికా కన్‌స్ట్రక్షన్స్ అధినేత మా హారికా ప్రసాద్ గారికి జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ K.N.S.V.ప్రసాద్ గారు
మేనేజింగ్ డైరెక్టర్, హారిక కన్‌స్ట్రక్షన్స్ & కన్సల్టెంట్
Sarada CONSTRUCTIONS
చిన్నబజార్ రోడ్డు, శ్రీకాకుళం


# ఊరు మనదే దోచేయ్



- రోడ్డు మీదుగా వెళితే ఛార్జీలట
- గెజిట్‌ను కాదని ధరలు
- కళ్లముందే వసూలుచేస్తున్నా పట్టించుకోని పంచాయతీ అధికారులు

## శ్రీకూర్మంలో ఆశీల కాంట్రాక్టర్ నిలువుదోపిడీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ రహదారిపైన కార్లు, బస్సులు, లారీల మీద వెళ్తే టోల్‌ఫీజు వసూలు చేయడం మనకు తెలుసు. నేషనల్ పర్మిట్ లేని లారీలు రాష్ట్ర బోర్డర్ దాటినప్పుడు వసూలుచేసే టాక్స్ తెలుసు. అంతెందుకు.. మార్కెట్‌కు వచ్చే వాహనాల నుంచి కిస్తీ వసూలు చేయడం అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో కామన్. ఎందుకంటే.. ఇవన్నీ ఆదాయ వనరులే. కానీ ఒక పంచాయతీ రోడ్డు మీద నుంచి వెళ్తున్న పాపానికే ఆశీలు కట్టాలనడం కచ్చితంగా విడ్డూరమే. ఇదెక్కడో కాదు.. శ్రీకాకుళం నియోజకవర్గంలోనే శ్రీకూర్మం పుణ్యక్షేత్రం ఉన్న పంచాయతీలో జరుగుతోంది. శ్రీకూర్మనాథ ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలకు ఎటువంటి పార్కింగ్ సౌకర్యం కల్పించకపోయినా ఎప్పట్నుంచో పార్కింగ్ ఛార్జీలు పంచాయతీ వసూలు చేస్తుంది. పోనీ ఆదాయం పంచాయతీ అభివృద్ధికి ఖర్చుపెడతారు కదాన్న కోణంలో చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఇప్పుడు ఏకంగా శ్రీకూర్మం రోడ్డు మీదుగా వాహనం వెళ్తే చాలు.. అడ్డంపడిపోయి మరీ దోచేస్తున్నారు. ఇదేంటంటే.. ఆశీలు వసూలు చేసుకోడానికి పంచాయతీ తమకు పర్మిషన్ ఇచ్చిందంటున్నారు. అసలు పంచాయతీ అనుమతులు దేనికి ఇచ్చింది, వీరు దేనికి వసూలు చేస్తున్నారన్న సమాధానం చెప్పడానికి కూడా శ్రీకూర్మం పంచాయతీ అధికారులు ఇష్టపడటంలేదు. వాస్తవానికి ఇక్కడ మార్కెట్ అవసరాల కోసం వచ్చే



వాహనాల నుంచి మాత్రమే ఆశీలు వసూలు చేయాలి. అది కూడా పంచాయతీ నిర్దేశించిన మొత్తానికి. మరోవైపు శ్రీకూర్మం దేవస్థానం ఎదురుగా వాహనాలు పార్క్ చేస్తే, పార్కింగ్ ఛార్జీలు వసూలు చేయొచ్చు. కానీ వీరు చేస్తున్నదేమిటి?

రోడ్డు మీదకు వాహనం వస్తే చాలు.. పార్కింగ్ పేరుతో శ్రీకూర్మంలో అడ్డగోలుగా ఆశీలు వసూలు చేస్తున్నారు. గార- కళింగపట్నం రోడ్డులో


- మిగతా చివరి పేజీలో



ఆదిత్య రమ
లక్కీ బ్యూటీ పార్లర్ వారి
pinks n bloos®
HAIR | BEAUTY | MAKEUP
UNISEX FAMILY SALOON
CELL: 7032485790, 8464935407
మా ప్రియమైన కస్టమర్లకు మరియు శ్రేయోభిలాషులకు ఇదే మా ఆహ్వానం
Opening SHORTLY
06-06-2025
Shop No:5-2-33, Chinna Bazaar Road, Near Venkateswara Swamy Temple, Opp. Neelammatalli Temple, Srikakulam



JMR Flavours Veg. & Non-Veg Restaurant
కార్ పార్కింగ్ సదుపాయం కలదు


## పశువుల కోసం ప్రత్యేకమైన కాలనీ

- చరిత్ర కలిగిన న్యూకాలనీలో ప్రయాణించడం అంత సులువు కాదు
- ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీల సమస్యకు తోడు పశువులకొట్టంగా మారిన వైనం





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం న్యూకాలనీలో ఎవరుంటారు? ఈ ప్రశ్నకు ఒక దశాబ్దం క్రితమైతే బాగా పేరుమోసినవారు, డబ్బున్నవారు, అధికారులు, రాజకీయ నాయకులు ఉంటారు అని ఠక్కున చెప్పేవారు. ఆతర్వాత న్యూకాలనీలో ఎవరుంటారులే అనే నిర్లిప్తత కనిపించిందంటే.. అందుకు కారణం ఇక్కడ నివాస ప్రాంతాల్లో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు భవనాలను అద్దెకు తీసుకోవడమే. దీంతోనే అక్కడ ఉన్నవారు వేగలేకపోతున్నా మని ఆమధ్య స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌ను పిలిచి ఓ శాలువ కప్పి మా మొర ఆలకించండి మహాప్రభో అంటూ ఓ సమా వేశం పెట్టారు. అంతకు ముందు అనేక మార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లి వినతిపత్రం సమర్పించారు. అప్పట్లో కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతులు ఏమేరకు పరిష్కారమయ్యాయో పక్కన పెడితే ఇప్పుడు న్యూకాలనీలో ఎవరుంటున్నారు? అన్న ప్రశ్న మరొకసారి వేసుకోవాలి. అదే న్యూకాలనీలో ఇప్పుడు ఆవులు, గేదెలు.. ఒక్క మాటలో చెప్పాలంటే పశువులు ప్రశాంతంగా ఉంటున్నాయి. ఇక్కడ నివసించేవారు ఇళ్లకు వెళ్లాలంటే పగలు ట్రాన్స్‌పోర్ట్ లారీలు సైడివ్వాలి.. రాత్రులు పశువులు పక్కకు తప్పుకోవాలి. ఈ రెండూ జరిగితే కుక్కలు పిక్కలు పీకేయకుండా ఉంటే ఇంటికెళ్లగలరు. లేదూ అంటే దైవాధీనం. జిల్లాలోనే మొట్టమొదటి ప్లాన్ అప్రూవ్డ్ లేఅవుట్ ఇది. మిగతా ప్రాంతాల మాదిరిగా అంటే.. ఏపీహెచ్‌బీ కాలనీలో ఎంఐజీ, ఎల్‌ఐజీల మాదిరిగా కాకుండా 12 సెంట్లలో ఒక ప్లాట్‌ను ఏర్పాటుచేసిన సువిశాలమైన లేఅవుట్ ఇది. అటువంటిది ఇక్కడ ఇప్పుడు పశువులకు ఆవాసంగా మారిపోవడం కొసమెరుపు. న్యూకాలనీలో మెయిన్ రోడ్డులో చైతన్య విద్యాసంస్థ ఉంది. ఈ రోడ్డు మీద సాయంత్రం విద్యార్థులు వెళ్లిపోయిన తర్వాత పశువులొస్తాయి. ఆవులు ఎక్కడి నుంచి వస్తాయో తెలియదు గానీ మొత్తం ఈ రోడ్డంతా విచ్చలవిడిగా వాడుకుంటాయి. వీటిని తప్పిస్తూ పక్కనే గుంపులుగా ఉన్న శు నకరాజంల మీదకు వెళ్లి ఇంజక్షన్లు ఇప్పిం చుకున్న స్థానికులు కోకొల్లలు. పోనీ ఈ రోడ్డు నిండా గోవులున్నాయని ఉదయం వాటికి దండం పెడుతున్నాం కాబట్టి రాత్రులు గౌరవిద్దామని పక్క రోడ్డు నుంచి అంటే న్యూకాలనీ మెయిన్ రోడ్డు (సూర్య మహల్ రోడ్డుకు కనెక్టివిటీ వయా ఎక్సైజ్ సీఐ ఆఫీస్) మీదుగా వెళ్దామని భావించి టర్న్ తీసుకుంటే అక్కడ మరో గ్రూప్ ఆవులు తిష్టవేసి కనిపిస్తాయి. అసలు మీరు ఆవుల వరకు పోవాలంటే ముందు నన్ను దాటాలి కదా అని బాకర్‌సాహెబ్ పేట మీద నుంచి న్యూకాలనీకి టర్న్ తీసుకునే రోడ్డులో సాక్షాత్తు మాజీ ఎమ్మెల్యే చల్లా లక్ష్మీనారా యణ ఇంటి రోడ్డులో గేదెలు హఠం వేసుకొని రోడ్డు మొత్తాన్ని ఆక్రమించేస్తాయి. ఈ ప్రాంతంలో పాల వ్యాపారం చేసే కుటుంబాలు కొన్ని ఉన్నాయి. వీరంతా ఏమేరకు పాలమ్ముతున్నారో తెలియదు కానీ, గేదెలను మాత్రం రోడ్డుపైనే వదిలేస్తున్నారు. వీటిని తప్పించుకొని న్యూకాలనీ మీదుగా ప్రయాణించడం ఇప్పుడొక సాహసకృత్యమే. కొద్ది రోజుల క్రితం వరకు బాకర్‌సాహెబ్ పేట 786 అపార్ట్‌మెంట్ ఎందురుగా గేదెలు ఇలాగే రోడ్డు మీదే ఉండేవి. రాత్రింబవళ్లు ఈ రోడ్డు మీద ట్రాఫిక్‌జామ్ కనిపించేది. అప్పట్లో మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య గేదెలను ఇంటిలో కట్టకపోతే ఎత్తుకుపోయి బజారులో అమ్మేస్తామంటూ వార్నింగ్ ఇవ్వడంతో వీటిని ఇప్పుడు రోడ్డు మీదకు విడిచిపెట్టడంలేదు. ఈ సమస్య తీరిందనే సరికి చల్లా లక్ష్మీనారాయణ ఇంటి దగ్గర గేదెల మీటింగ్ నిత్యకృత్యమైపోయింది. 2019-24 మధ్య మున్సిపల్ వ్యవహారాలు లక్ష్మీనారాయణ తనయుడు చల్లా శ్రీను చూసినన్నాళ్లూ ఈ సమస్య తలెత్తలేదు. ఇప్పుడు ఆ కుటుంబం కూడా అక్కడ ఉండకపోవడంతో రోడ్డును ఈ పశుపోషకులు తమ సొంతానికి వాడుకుంటున్నారు.


జన్మదిన శుభాకాంక్షలు
నిర్మాణ రంగంలో అగ్రగామిగా అంచెలంచెలుగా ఎదుగుతూ..
ఎందరికో మార్గదర్శిగా, మా అందరికీ
ఆదర్శప్రాయుడిగా నిలిచిన మంచి మనిషి,
ఆపద్బాంధవుడు.. కష్టమనేవారికి నేనున్నానంటూ
భరోసా ఇచ్చే హారికా కన్‌స్ట్రక్షన్స్ అధినేత
మా హారికా ప్రసాద్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
స్టాఫ్ - హారికా కన్‌స్ట్రక్షన్స్
శ్రీ K.N.S.V.ప్రసాద్ గారు
మేనేజింగ్ డైరెక్టర్, హారిక కన్‌స్ట్రక్షన్స్ & కన్సల్టెంట్
03 JUN 2025
పి. రాఘవకుమార్ మేనేజర్
ఆర్. ప్రదీప్ కుమార్ సీనియర్ ఫీల్డ్ ఇంజినీర్
ఎ.ఆర్.మోహన్ వైజాగ్ ఆఫీస్ ఇన్‌ఛార్జ్
జి.అనీల్‌కుమార్ సివిల్ ఇంజినీర్
బి. తిరుపతిరావు సూపర్‌వైజర్
బరాటం సాగర్ సీనియర్ ఫీల్డ్ ఇంజినీర్
జి. ప్రసన్న జూనియర్ ఫీల్డ్ ఇంజినీర్
ఎ.హారిక జూనియర్ ఫీల్డ్ ఇంజినీర్
పి.రమేష్ ఎలక్ట్రీషియన్
సాహుకారి భార్గవ్ AUTO CAD
టేకి శ్రీనివాసరావు సైట్ సూపర్‌వైజర్
Happy Birthday
HARIKA Constructions & Consultants
గాంధీనగర్, సానావీధి, శ్రీకాకుళం

• ఎడిటోరియల్

# బంగారు రుణాలపై ఆంక్షలు సబబేనా?

ఆర్థిక వ్యవహారాల్లో రుణాలదే కీలక పాత్ర. దిగువస్థాయిలో ఉండే పేదవాడి నుంచి పైస్థాయిలో ప్రభుత్వాల వరకు రుణాలు లేకుండా తమ ఇంటిని లేదా ప్రభుత్వాన్ని నడపగలగడాన్ని ఊహించలేం. రుణాల్లో కూడా బంగారు వస్తువులు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కంటే బ్యాంకుల్లో అతి స్వల్ప వడ్డీ రేటు, నిమిషాల వ్యవధిలో గోల్డ్ లోన్లు ఇస్తుండటంతో ఈ విధానం బాగా చెలామణీలోకి వచ్చింది. సామాన్య గృహస్తుల నుంచి చిరు వ్యాపారులు, ఉద్యోగులు, రైతుల వరకు అవసరమైనప్పుడు తమ ఇళ్లలో ఉన్న నగలు బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకోవడం, మళ్లీ డబ్బు సర్దుబాటు అయిన వెంటనే బ్యాంకుకు చెల్లించి నగలు విడిపించుకోవడం ఈ మధ్య కాలంలో బాగా పెరిగింది. అయితే ఈ వెసులుబాటుపై రిజర్వ్ బ్యాంకు కత్తి కట్టింది. గోల్డ్ లోన్ల మంజూరు మార్గదర్శకాలను కఠినతరం చేసింది. దాంతో బంగారంపై రుణాలు పొందడం సులభసాధ్యం కాని వ్యవహారంగా మారింది. రుణాల్లో పారదర్శకత పెంచి, అక్రమాలను అరికట్టడమే లక్ష్యంగా పేర్కొంటూ రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ) జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం.. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులతో పాటు ఎన్బీఎఫ్సీలు (నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు) ఇక నుంచి బంగారు, వెండి రుణాల పరిమితి తగ్గుతుంది. వినియోగదారుడు తీసుకొచ్చే నగ వాస్తవ విలువలో గరిష్టంగా 75 శాతం మేరకే రుణం ఇవ్వాలి. గతంలోనూ 75 శాతంగానే ఉన్న ఈ పరిమితిని కోవిడ్ సమయంలో 80 శాతానికి పెంచినా.. ఇప్పుడు మళ్లీ తగ్గించారు. వస్తువును తాకట్టు తీసుకొచ్చేవారు అది తమదేనన్న రుజువు చూపించాలి. ఇందుకోసం దాని కొనుగోలు రసీదు లేదా ఆ వస్తువు తమదేనని స్పష్టం చేస్తూ సంతకంతో కూడిన వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం(సెల్ఫ్ డిక్లరేషన్) సమర్పించాల్సి ఉంటుంది. కాగా అప్పు తీసుకునేవారికి వారు తాకట్టు పెట్టిన బంగారం లేదా వెండి వస్తువు బరువు, స్వచ్ఛత, మినహాయింపులు, ఫొటోలతో కూడిన సర్టిఫికెట్‌ను బ్యాంకింగ్ సంస్థలు ఇవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల పారదర్శకత పెరుగుతుంది. 22 క్యారెట్ల కంటే తక్కువ స్వచ్ఛత ఉన్న బంగారానికి ఇక నుంచి రుణం మంజూరు చేయరు. అయితే బ్యాంకులు అమ్మే ఇండియా గోల్డ్ కాయిన్స్‌ను మాత్రం స్వీకరిస్తారు. బంగారంతో పాటు తొలిసారిగా వెండి రుణాలకు రిజర్వ్ బ్యాంకు అనుమతి వచ్చింది. అయితే 925 స్వచ్ఛత ఉన్న ప్రత్యేక వెండి నాణాలపైనే ఈ అవకాశం కల్పించారు. ఒకే రుణంలో ఖాతాపై గరిష్ఠంగా ఒక కిలో బంగారు ఆభరణాలు, 50 గ్రాముల బంగారు నాణాలకు మాత్రమే అవకాశం ఉంటుంది. బంగారం విలువను 22 క్యారెట్ల ధర ప్రకారమే లెక్కిస్తారు. రుణ ఒప్పంద పత్రాల్లో బ్యాంకు వసూలు చేసే అన్ని ఛార్జీలు, బంగారం వివరాలు, వేలం ప్రక్రియ, చెల్లింపు గడువు వివరాలు స్పష్టంగా పేర్కొనాల్సి ఉంటుంది. ఖాతాదారుడు రుణం పూర్తిగా చెల్లించాక గరిష్టంగా ఏడు పనిదినాల్లోపు బంగారం తిరిగి ఇవ్వాలి. ఆలస్యమైతే రోజుకు రూ.5 వేలు చొప్పున బ్యాంకులు జరిమానా చెల్లించాల్సి వస్తుంది. బంగారు రుణాలు పొందడంలో అక్రమ పద్ధతులు అనుసరిస్తున్నట్టు తమ దృష్టికి రావడంతో నిబంధనల్లో కొన్ని మార్పులు చేశామని ఆర్బీఐ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ తరుణ్ సింగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్లయింట్ లేకుండానే బంగారానికి విలువ కట్టడం, బంగారు రుణాలపై నిరంతర పర్యవేక్షణ లేకపోవడం, రుణాలు చెల్లించని పక్షంలో ఆ బంగారాన్ని వేలం వేసే విషయంలో పారదర్శకత లేకపోవడం తదితర ఇబ్బందులు తమ దృష్టికి వచ్చినందునే కొన్ని మార్పులు చేశామన్నారు. ఈ కొత్త నిబంధనలపై కొంత వ్యతిరేకత కనిపిస్తోంది. ముఖ్యంగా తమిళనాడులో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడేందుకు దోహదం చేసేలా ఉన్న ఈ కొత్త మార్గదర్శకాలను వెంటనే ఉపసంహరించుకోవాలని అక్కడి ప్రజలు, ప్రభుత్వ, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. సన్నకారు రైతులు, చిరు వ్యాపారులకు లోన్లు పొందడం ఇకపై కొంత కష్టంగా ఉంటుందని అంటున్నారు. అల్పాదాయ వర్గాల ప్రజలు తమ ఇంట్లోని నగలను ఇంతవరకు బ్యాంకులో కదువ పెట్టి అవసరాలు తీర్చుకునేవారు. ఇక నుంచి వారు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతూ అధిక వడ్డీలు చెల్లించుకోవాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి వెళ్లడంతో ఆమె కొంత వెసులుబాటు కల్పించే సూచన చేశారు. కొత్త మార్గదర్శకాల నుంచి రూ.2 లక్షల్లోపు బంగారు రుణాలను మినహాయించాలని రిజర్వ్ బ్యాంకుకు సూచించారు. ఆ మేరకు ఆర్బీఐ నిర్ణయం తీసుకుంటే సామాన్య వినియోగదారులకు కొంత ఉపశమనం కలుగుతుంది.

## ఘనంగా "తెరవే" కవిసమ్మేళనం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగు రచయితల వేదిక 105వ నెలవారీ సాహితీ సమ్మేళనం స్థానిక శాంతినికేతన్ కళాశాలలో సంస్థ ప్రధాన కార్యదర్శి రఘుపాత్రుని వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి సాహితీవేత్త తోట గోపాలరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.కార్యక్రమంలో ముందుగా ప్రముఖ సాహితీవేత్త,గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు మృతికి సంతాప సూచకంగా సభ్యులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. తదుపరి వక్తలు మాట్లాడుతూ పులఖండం మరణం సాహితీ లోకానికి తీరని లోటని,ఆయన సాహితీ సేవలను కొనియాడారు. ప్రధాన కార్యదర్శి వార్షిక నివేదిక అనంతరం ముఖ్య అతిథి గోపాలరావు సాహితీ ప్రసంగం చేశారు. తెరవే కవులచే కవిసమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో కవులు డా.కోమలరావు, ఐ.యన్.డి ప్రసాద్,వావిలపల్లి రాజారావు, కిల్లాన శ్రీనివాస్,ఆర్.వి.రమణమూర్తి, టి. గోపాలరావు, కుప్పిలి త్రినాథరావు, సోడవరం ఈశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ యన్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## 5వ రోజు వైభవంగా వరల్డ్ ఎక్స్‌పో-2025

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గత నెల 31న జపాన్‌లోని ఇండోనేషియా పెవిలియన్, భారత్ పెవిలియన్‌లో నార్త్ వెస్ట్ వేదికపై వైభవంగా ఐదవరోజు జరిగిన వరల్డ్ ఎక్స్పో-2025లో జిల్లాకు చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ దర్శకుడు శ్రీకాంత్ రఘుపాత్రుని శిష్య బృందం జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఉదయం జానపద నృత్యాన్ని, సాయంత్రం శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. టోక్యోలో జపాన్-భారత రాయబార కార్యాలయంలో 30న ఆంధ్రా పరంపరా పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇదే బృందం చక్కటి ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ బృందాన్ని అక్కడికి విచ్చేసిన భారత్, జపాన్ అంబాసిడర్లు ఎంతో కొనియాడారు. ఈ ప్రదర్శనలో రామ కౌండిన్య, అన్నా నేహా థామస్, గాయత్రి వర్షిత, నేహా పట్నాయక్, లలిత, చాందిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమకు ఈ అవకాశాన్ని కల్పించిన ఆంధ్రప్రదేశ్ భాషా సంస్కృతిక శాఖ వారికి, ఏపిఈడిబి వారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.



# దృఢ సంకల్పంతో ఆటలాడాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

క్రీడాకారులు గెలుపు ఓటిమిలతో పనిలేకుండా చక్కని దృఢ సంకల్పంతో ఆటలు ఆడాలని, క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని శ్రీకాకుళం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పి.సుందరరావు అన్నారు. రాష్ట్ర స్థాయితైక్వాండో పోటీలు ఈనెల 9 నుండి 11 వరకు మూడురోజుల పాటు అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరగనున్నాయి. దీనిలో భాగంగా శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఒలింపిక్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పెంకి సుందరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 17 ఏళ్లుగా తైక్వాండో, ఉషూ క్రీడలకు చక్కని గుర్తింపు, గౌరవాన్ని తెచ్చిన తైక్వాండో ప్రధానకోచ్ కొమర భాస్కర రావు, రెడ్డి శివకుమార్‌లను ఆయన అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న చిన్నారులకు ఆయన ఆశీస్సులు అందించారు. నాలుగు విభాగాల్లో తైక్వాండో పోటీలు జరిగాయి. ఇందులో విజేతలుగా నిలిచేవారు రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. అనంతరం జాతీయస్థాయిలో తైక్వాండో పోటీల్లో పలు అవార్డులు రివార్డులు పొందిన చాతుర్యను అతిథులు అంతా అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ కో-ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, స్టార్‌వాకర్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు బి.వి.రవిశంకర్, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధి జి.లక్ష్మి, రిమ్స్ ఆస్పత్రి వైద్యులు పి.కిరణ్‌కుమార్, కారే సంజీవ్ తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డి శివకుమార్, సహాయ కోచ్‌లు పాల్గొన్నారు.



"ఒంటరి మహిళకు" అండగా

## బూర్జ ఎస్ఐ ప్రవల్లిక


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక కంపోస్ట్ కోలనీకి చెందిన గేదెల లక్ష్మి అనే "ఒంటరి మహిళకు" అండగా బూర్జ ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక నిత్యావసర సరుకులను అందించి అండగానిలిచారు. ఒక ప్రకటనలో బూర్జ ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక మాట్లాడుతూ గేదెల లక్ష్మి భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించారని, ఇప్పుడు లక్ష్మి కూడా ప్లేట్‌లెట్స్ తగ్గుతూ మంచానికే పరిమితమయ్యారని, చిన్న వయస్కుడైన కుమారునితో జీవనం కొనసాగిస్తుందన్నారు. నిస్సహాయ స్థితుల్లో ఉన్నవారిని ఆదుకోవటం మానవునిగా మన కనీస బాధ్యతని, లక్ష్మి కుటుంబానికి తన వంతు సహకారంగా రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను పెద్దపాడుకు చెందిన బొట్టా సాయికుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, స్టేట్‌బ్యాంకు అఫ్ ఇండియా అసోసియేట్ నల్ల గౌతమి చేతుల మీదుగా అందించామన్నారు. ఇదివరకు బొట్టా సాయి కుమార్ నిత్యావసర సరుకులు అందించారని, ఈ రోజు నల్ల గౌతమి కొంతనగదుని లక్ష్మికు అందించటం ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా దాతలు ఈ ఒంటరి మహిళా కుటుంబానికి ఏదో ఒకరూపంలో సాయమందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గేదెల లక్ష్మి, సహాయకులు, సేవకులు స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా అసోసియేట్ నల్ల గౌతమి, పెద్దపాడుకు చెందిన బొట్టా సాయికుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధి, నంది ఉమాశంకర్, జేసీ, లైనిజం, ఉర్లం శివతేజ పట్నాయక్ పాల్గొన్నారు.






# నాలాంటివాళ్లు ఎవ్వరూ ఉండరు



"ఏ సంగీతకారుడినైనా తీసుకోండి. వాళ్లు తప్పనిసరిగా సంగీతం నేర్చుకుని ఉంటారు, లేదంటే ఎవరిదగ్గరైనా శిష్యరికం చేసి ఉంటారు. నేను మాత్రం ఎవరి దగ్గరా సంగీతం నేర్చుకోలేదు. నాకు ఆ దేవుడే ఈ వరాన్ని ఇచ్చినట్టుగా అనిపిస్తుంది. నాలాంటివాళ్లు ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఉండరు. గతంలోనూ లేరు, భవిష్యత్తులోనూ రారు" అన్నారు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా. ఆయన ఇటీవల తెలుగు చిత్రం 'షష్టిపూర్తి'కి స్వరాలు సమకూర్చారు. రూపేశ్ కథానాయకుడిగా నటిస్తూ, నిర్మించిన చిత్రమిది. రాజేంద్రప్రసాద్, అర్చన కీలక పాత్రలు పోషించారు. పవన్ ప్రభ దర్శకుడు. ఈ చిత్రం ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఇళయరాజాతో, గీత రచయిత చైతన్య ప్రసాద్ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ భేటీలో ఇళయరాజా పలు ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించారు.

"నేను ఎక్కడో ఓ చిన్న గ్రామంలో పుట్టాను. అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు కూడా ఉండరు. చిన్నప్పుడు మా అన్న పాటలు పాడుతుండేవారు. అలా ఆ పాటలు వింటూ నేను ఏదో ఒకటి వాయిస్తూ ఉండేవాడిని. అలాంటి చోటు నుంచి ఈ స్థాయికి వచ్చాను. అసలు నాకు సంగీతం ఎలా వచ్చింది? నా నుంచి పాటలు ఎలా ఉద్భవిస్తాయో కూడా నాకు తెలియదు. మా అన్న పాడిన పాటలకు నేను సంగీతం వాయిస్తే, అప్పుడు అందరూ చప్పట్లు కొడుతుండేవారు. ఆ చప్పట్లు వింటే నాకు గర్వం పెరుగుతూ వచ్చేది. అయితే వాళ్లు చప్పట్లు కొట్టేది నేను వాయించినందుకా లేక, ఆ సంగీతానికా? అనే ప్రశ్న మొదలైంది. సంగీతానికి కొడుతున్నారని తెలిశాక, నేనూ అలా సంగీతం కంపోజ్ చేయాలని దానిపై దృష్టిపెట్టా. అలా సంగీత దర్శకుడినయ్యా" అన్నారు ఇళయరాజా. ఏఐ సాంకేతికత గురించి ఆయన మాట్లాడుతూ "ట్రెండ్ అనే మాట నాకు అర్థం కాదు. పాట బాగుంటే ఎప్పుడైనా వింటారు. అందులో ట్రెండ్ అనేది ఏదీ ఉండదు. ఏఐ (కృత్రిమమేధ) అనేది స్వతహాగా ఏమీ చేయలేదు. మనిషి మెదడు లక్ష ఏఐలతో సమానం. మనిషి ఏఐని కనిపెట్టాడు కానీ, ఏఐ మనిషిని కానీ, మానవ మెదడుని కానీ సృష్టించలేదు" అన్నారు. కొత్తగా వస్తున్న తరాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే 'షష్టిపూర్తి' చేశానని చెప్పారు ఇళయరాజా. "మంచి కథ ఉందా లేదా? అనేదే చూస్తాను. స్టార్స్ ఉన్నారా? లేదా అనేది ఎప్పుడూ పట్టించుకోను. నా కెరీర్ ఆరంభం నుంచీ కొత్తవాళ్లని ప్రోత్సహిస్తూ వస్తున్నా. భారతీరాజా, మణిరత్నం... ఇలా అందరూ అప్పట్లో కొత్తవాళ్లే. నాతో సినిమాలు చేశాక వారికి ఆ స్టార్‌డమ్, గుర్తింపు వచ్చింది" అన్నారు.



రాజేంద్రప్రసాద్ అలా మాట్లాడకపోతేనే వార్త.. ఈమధ్య ఎవరు అతిథిగా పిలిచినా సరే వెళ్లి, ఏదేదో మాట్లాడుతున్నాడు. ఏదో అయ్యింది తనకు.. అందుకే తేడా కొడుతోంది. రాను రాను ఎవరు తనల్ని ఏ ఫంక్షన్‌కు పిలవాలన్నా సరే ఒకటికి వందసార్లు ఆలోచించుకోవాలి, లేదా ఏదో ఓరకంగా పిచ్చి కూతలతోనైనా ప్రచారం తీసుకువస్తున్నాడు కదా అనుకుంటే తప్ప.. తనొక మంచి వక్తను అనే భ్రమల్లో బతుకుతున్నాడు పాపం.. అయిదు తరాల నటులతో పనిచేశాను, ఆఫ్టరాల్ వీళ్లంతా ఎంత అనే యాటిట్యూడ్

## 'మా' పూనుకుని రాజేంద్రప్రసాద్‌కు మానసిక చికిత్స చేయించాలి..!!

భీకరంగా కనిపిస్తోంది. కానీ తన నాలుక మీద తనకు అదుపు లేదని.,. ఫ్లోలో సిగ్గూశరం, సంస్కారం, హుందాతనం, పెద్దరికం, వయస్సు అన్నీ మరిచిపోతున్నాననే సోయి లేదు తనకు.. తనేం మాట్లాడుతున్నాడో తనకే అర్థం కాదు. అంత పొంతన లేకుండా ఉంటాయి వాక్యాలు.. ఎటు నుంచి ఎటు పోతున్నాడో తెలియదు. తను చెప్పదలుచుకున్నది సూటిగా, అర్థమయ్యేలా చెప్పడం చేతకాని అవస్థ ఇది!!

ఆమధ్య ఏదో ఫంక్షన్‌లో (హరికథ వెబ్ సీరీస్) మాట్లాడుతూ బన్నీని కించపరిచేలా ఇప్పుడు చందనం దొంగలు హీరోలు అన్నాడు. సరే, తన పాజిటివ్ పాత్రను హైలైట్ చేసుకోవడానికి ఇప్పటి నెగెటివ్ హీరో పాత్రలను కంట్రాస్టుగా ఏదో చెప్పబోయి, అది సరిగ్గా చెప్పలేక బోల్తాకొట్టాడు అనుకుందాం.. క్రికెటర్ డేవిడ్ వార్నర్‌ను ఉద్దేశించి ఓ బూతు వదిలాడు. కుసంస్కారి.. తరువాత అందరూ బూతులు తిట్టేసరికి లెంపలేసుకుని, నాలుక కర్చుకుని సారీ చెప్పాడు.. ఏం మనిషో.. ఇప్పుడు మళ్లీ ఎస్వీ కృష్ణారెడ్డి బాపతు ఏదో ఫంక్షన్‌లో కమెడియన్ ఆలీని ఉద్దేశించి రాయడానికి వీల్లేని బూతు వదిలాడు. ఎంత చనువు ఉన్నా, ప్రైవేటుగా మాట్లాడుకుంటున్నప్పుడో, మందు కొట్టినప్పుడో ఎవరు ఏమని పిలుచుకున్నా అది వేరు. కానీ బహిరంగంగా, వేదికల మీద మాట్లాడేటప్పుడు కాస్త డీసెన్సీ, సంస్కారం గట్రా అవసరం.. అది లోపించింది ఈ మనిషిలో.. పాపం ఆలీ ఏమీ అనలేదు, అక్కడికి వచ్చినవాళ్లు కూడా విస్తుపోయారు. ఒరేయ్, ఏం కూతలురా అని అనలేరు కదా.. ఏమో, టీవీ చానెళ్లు, ఇతర మీడియా రాజేంద్రప్రసాద్ బూతుల మీద నెగెటివ్‌గా రియాక్టయి అసలు ఏం మనిషి అతను అన్నట్టుగా రాస్తున్నారు కదా.. రేపోమాపో మరో వీడియో రిలీజ్ చేస్తూ సారీ చెబుతాడేమో.. అడుసు తొక్కుతూనే ఉంటాడు, కాళ్లు కడుగుతూనే ఉంటాడు.. ఆ తోక ఎప్పుడూ వంకరే.. ఎవరో తిక్కరేగి, అక్కడే, ఆ వేదిక మీదే ఉగ్రరూపం దాల్చి ఏమైనా తీవ్ర స్పందన కనబరిచేవరకూ తను అంతేనేమో..!!

- ముచ్చట సౌజన్యంతో..

## మోడల్ లాసెట్ ఎంతో ఉపయోగకరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం నిర్వహించిన మోడల్ లాసెట్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని అభ్యర్థులు ప్రశంసించారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఏంపీర్ లా కాలేజీలో ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమా మహేశ్వర రావు, చౌదరి లక్ష్మణ రావు, సంఘం సీనియర్ సభ్యులు, శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎన్ని సూర్యారావుల ఆధ్వర్యంలో కాలేజీ ప్రిన్సిపాల్ కె.మోషే సహకారంతో మోడల్ లాసెట్ నిర్వహించారు. గత తొమ్మిది ఏళ్లుగా మోడల్ లాసెట్ నిర్వహించడం ఎంతో అభినందనీయం అని ప్రముఖ న్యాయవాది తలే లక్ష్మణ రావు అన్నారు. అభ్యర్థులు ఇటువంటి మోడల్ పరీక్షల ద్వారా ప్రధాన పరీక్షల్లో ఎక్కువ మార్కులు పొందవచ్చునన్నారు.



## వేసవి శిబిరం విజయవంతం

(సత్యంన్యూస్, పాలకొండ)

పాలకొండ శాఖ గ్రంథాలయంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది. దీనిలో భాగంగా భాగంగా 36వ రోజు సోమవారం రిటైర్డ్ టీచర్ గొన్నాబత్తుల దుర్గా రావు పిల్లలకు స్వాతంత్ర సమరయోధుల కొండారి జీవిత చరిత్ర గురించి పిల్లలకు తెలియజేశారు. అదే విధంగా ఈనెల 3నుంచి మూడు రోజుల పాటు వివిధ పోటీలు పెట్టనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం స్వర్ణ ఆంధ్ర-2047 అనే అంశంపై చిత్ర లేఖనం పోటీ పెట్టనున్నామన్నారు. విజేతలకు చివరిరోజైన ఆరవ తేదీన బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ పోటీలలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థిని, విద్యార్థులు ఉదయం 10 గంటలకు గ్రంథాలయ ప్రాంగణంలో పాల్గొనవచ్చున్నారు. కార్య క్రమంలో ఇంచార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.



## యోగా జీవితంలో ఒక భాగం కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగా జీవితంలో ఒక భాగం కావాలని ఆర్ఐఓ వి. దుర్గారావు తెలిపారు. 80 అడుగుల రహదారిలో జిల్లా వొకేషనల్ అధికారి ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగాసనాలు చేయడం వలన క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. యోగా అద్భుతమైన వనరు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేమంతా భాగస్వాములై కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తామన్నారు. ఇంటర్మీడియట్ విద్యకు 2వ తేదీన, 21వ తేదీన యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. ఆయుష్ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ గనగల్లపేటలో మే 3వ తేదీన నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ జగదీష్, డివిఈఓ, యోగా శిక్షకులు మురళీకృష్ణ, స్వాతి, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కలలు కనండి... నిజం చేసుకోండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతి ఒక్కరూ భవిష్యత్తు కోసం పెద్ద కలలు కనాలని వాటిని నిజం చేసుకునే దిశగా ప్రయత్నాలు సాగించాలని జనసేన నాయకులు, ప్రముఖ గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. ఇటీవల చైతన్య దీపిక దినపత్రిక నిర్వహించిన చిన్నారి ప్రపంచం కాంటెస్ట్ లో రాణించి భవిష్యత్తులో కలెక్టర్ కావాలని ఆకాంక్షించిన చిన్నారులకు డాక్టర్ దానేటి శ్రీధర్ ఆసుపత్రిలో ఆదివారం డాక్టర్ శ్రీధర్ ఆర్థిక ప్రోత్సాహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ చిత్రలేఖన పోటీల్లో పాల్గొని విజయం సాధించిన ఈ చిన్నారులను ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్న వారి ఆకాంక్షను ప్రోత్సహిస్తూ ప్రతి ఏడాది జూన్ 1న ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని గుర్తించి వారిని నచ్చిన రంగంలో ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధించగలుగుతారని చెప్పారు. చదువుకు పేదరికం అడ్డు కాదని కార్యక్రమంలో చైతన్య దీపిక దినపత్రిక యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు. నలుగురు చిన్నారులకు నగదు ప్రోత్సాహం అందజేసి వారి తల్లిదండ్రులను అభినందించారు.

## ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సాహించటం హర్షణీయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సాహించటం హర్షణీయమని, అది కూడా ఒక బాధ్యతతో వ్యవహరించటం గొప్పవిషయమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక కిన్నెరా థియేటర్ దగ్గర గల అంజయ్య మిక్సర్ అధినేత కోరాడ.రమేష్ ఆధ్వర్యంలో ఇంటర్‌లో అత్యధిక మార్కులతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా సుమారు ఆరవై మంది విద్యార్థులను శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ ముఖ్య అతిధిగా పాల్గొని, ఆయన చేతుల మీదుగా దుస్సాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను, బహుమతులను అందించి మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులకు ప్రొత్సాహాన్నందిస్తే, మిగిలిన విద్యార్థులు స్ఫూర్తి పొందుతారన్నారు. ప్రతీ విద్యార్థి బాగా చదివి, ఉత్తమ స్థానంలో నిలిచి, చదువుతున్న కళాశాలకు, గురువులకు, తల్లితండ్రులకు, జిల్లాకు మంచి పేరుప్రఖ్యాతులు తేవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం, విద్యార్థి విభాగాలపై ప్రత్యేక ద్రుష్టి సారిస్తున్నారని, వారికి ఎప్పుడూ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య మిక్సర్ యాజమాన్యం, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.



## సూర్యాఘర్ యోజన పథకంపై అవగాహన పెంచుకోండి



(సత్యంన్యూస్, రణస్థలం)

ప్రధాన మంత్రి సూర్యాఘర్ యోజన పథకం అమలు క్రింద ప్రప్రథమంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్వగ్రామమైన వీఎన్‌పురం గ్రామంలో ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్స్ పెట్టే కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామ పురప్రజలతో సోమవారం ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల ఆలోచనల్లో భాగంగా ఈ సోలా ర్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేయనున్నామన్నారు. తమ గ్రామంలో పీఎం సూర్యఘర్ యోజన పథకం క్రింద ప్రప్రథమంగా మొత్తం ఇళ్లపై సోలార్ గ్రూప్ టాప్స్ నిర్మించే విధంగా, శ్రీకాకుళం జిల్లా విద్యుత్ శాఖ అధికారులైన ఏఈలు, డీఈలు, ఏడీఈలు తదితర ప్రభుత్వ అధికారులు, గ్రామ ప్రజలతో, సంభందిత సోలార్ పవర్ ప్రొడక్షన్ కంపెనీ కన్సల్టెన్సీ వారితో కలసి వీఎన్‌పురం గ్రామస్థులతో అవగాహనా సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో పీఎం సూర్యాఘర్ పథకం వలన కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం ఇచ్చే రాయితీ, తదితర అంశాలు కూలంకుషంగా చర్చించుకొని , ఈ పథకం వలన గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లులు వస్తాయని తెలియజేశారు, ఈ పథకానికి తక్కువ వడ్డీకే బ్యాంకులు రుణాలు అందిస్తాయన్నారు. ప్రతీ ఇంటి పై కప్పుపై కనీసం 10చ.మీ./100 చదరపు అడుగుల స్థలంలో 1కేడబ్ల్యుపీ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవొచ్చని తెలిపారు. తన స్వగ్రామంలో నెలరోజుల వ్యవధిలో ప్రతీ ఇంటికి ఈ పథకం వంద శాతం అమలు జరిగే విధముగా కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి తెలియజేశారు.

## శాఖ గ్రంథాలయంలో యోగాపై అవగాహన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పిల్లలకు ముందుగా అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా ధ్యానం, ఆసనాలు, సూర్య నమస్కారాలు చేయించి వాటి ప్రాముఖ్యతను ఉపయోగాలను వివరించారు తదుపరి నీతి కథలు పద్యాలు వారితో చెప్పించారు ఈ కార్యక్రమంలో 27 మంది విద్యార్థులు సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు



## క్రీడారంగాన్ని అభివృద్ధి చేస్తాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆముదాలవలసలో క్రీడారంగాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సీఎం సిసి ఎమ్మెల్యే కప్ టి-20 ఏసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు ఆమదాలవలస అని, క్రీడల్లో మేటి అయిన ఈ ప్రాంతానికి ఆడిటోరియం నిర్మాణం చేపడతామని తెలిపారు. మూడు కోట్ల రూపాయలతో స్టేడియం నిర్మిస్తే గత వైకాపా పాలకులు దాన్ని విధ్వంసం చేశారని తిరిగి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. వీటిని కార్పొ రేట్ సంస్థల మాదిరిగా నిర్మిస్తామన్నారు. అన్ని రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడారంగం ద్వారా ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారని తెలియజేశారు. క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలని తెలియజేశారు. ఆమదాలవలస పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిసి ఆధ్వర్యంలో సీఎం సిసి ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఇలియాస్, హసన్ రాజా, బెనర్జీ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, బోర గోవిందరావు, టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు, ఈశ్వరరావు, అమృతేష్, అయ్యప్ప, సుప్రియ, సునీత, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్రీడాకారులు పాల్గొన్నారు.




# సైక్లింగ్‌తో "సంపూర్ణ ఆరోగ్యం"

- శ్రీకాకుళం సైక్లింగ్ క్లబ్ కాపవరపు సీజు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సైకిల్ తొక్కడం "సంపూర్ణ ఆరోగ్యమని", ఆరోగ్య సంపదకు సైక్లింగ్ ఎంతో అవసరమని నగరానికి చెందిన సైక్లిస్ట్ కాపవరపు సీజు సోమవారం అన్నారు. వృత్తిరీత్యా తీరికలేని కాలాన్ని గడుపుతున్న రోజులు, చదువుల కారణంగా చాలామంది వ్యాయామానికి దూరమవుతున్నారని, శారీరక శ్రమ తక్కువ కావడం, చిన్నవయసులోనే అధిక బరువు, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వ్యాయామం చేయడానికి అవకాశం లేనివారికి సైకిలింగ్ ఒక వేదికని, కార్యాలయాలకు, షాపింగ్‌కు వెళ్లేప్పుడు సైకిల్ వినియోగిస్తే, ఉత్సహంగా ఉండటంతో పాటు, శరీరానికి వ్యాయామం అందుతుందని, రోజులో కనీసం 30నిమిషాల పాటు సైక్లింగ్ చేస్తే అనేక లాభాలు ఉన్నాయని, బరువు తగ్గాలనుకునేవారికి సైక్లింగ్ ఒక మంచి మార్గమన్నారు. సైక్లింగ్ జీవక్రియ రేటును మెరుగుపరుచి, కండరాలను పెంచి, శరీరంలో కొవ్వును కరిగిస్తుందన్నారు. మీరు బరువు తగ్గాలనుకుంటే, ప్రతిరోజూ అర గంట సైకిల్ తొక్కితే ఒక ఏడాదిలో దాదాపు ఐదు కిలోల కొవ్వును కరిగిస్తుందన్నారు. సైక్లింగ్ మీ గుండె కండరాలను, రెస్టింగ్ పల్స్, రక్తంలో కొవ్వు స్థాయిలను తగ్గిస్తుందని, రోజు సైక్లింగ్ మీ గుండె, ఊపిరితిత్తులు, రక్త ప్రసరణను మెరుగుపరిచి, హృదయ సంబంధ సమస్యలను తగ్గిస్తుందన్నారు. సైకిల్‌పై వెళ్లే వ్యక్తులు తక్కువ కాలుష్యానికి గురవుతారని, ఇది ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తుందన్నారు. సైక్లింగ్ ఎముకల బలం, సమతుల్యత, సమన్వయాన్ని మెరుగుపరుస్తు, ఎముకల పగుళ్లు, విరగడం వంటి సమస్యలను నివారించి, ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లయితే సైక్లింగ్ ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. లైన్స్ క్లబ్ సెంట్రల్ మెంటార్ నటుకుల.మోహన్ మాట్లాడుతూ నడిచినప్పుడూ, పరుగుపెట్టినప్పుడూ మోకాళ్లూ, వెన్నుపై కొంత ఒత్తిడి పడే ఆస్కారం ఉంటుందని, సైకిలు తొక్కడం వల్ల కీళ్లపై పడే ఒత్తిడి తక్కువని, ప్రయోజనాలు ఎక్కువన్నారు. తొడలూ, పిరుదుల వద్ద పేరుకున్న కొవ్వూ కరుగుతుందని, సైకిలు తొక్కినప్పుడు మెదడు నుంచి న్యూరోట్రాన్స్ మీటర్లు విడుదలవుతాయని, ఇవి జీవక్రియల పనితీరును మెరుగుపరుచి, ఏకాగ్రతా, చురుకుదనం కూడా పెరుగుతాయన్నారు. సైకిల్ తొక్కడం వల్ల మీ మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, శరీరంలోని అన్ని కండరాలు పనిచేస్తాయని, కండరాలు పనులు చేయడానికి అనువుగా, దృఢంగా తయారవుతాయన్నారు. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గమని, ఆరోగ్యానికి మించిన సంపద లేదన్నారు. ప్రతీ ఆదివారం శ్రీకాకుళం సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు పాల్గొని సైక్లింగ్ చేస్తామని, పాల్గొనాలి అనుకునేవారు తన తమ సైకిల్‌తో ప్రతీ ఆదివారం ఉదయం ఆరుగంటలకు స్థానిక ఏడు రోడ్ల కూడలికి చేరుకోవాలన్నారు. ఆదివారం నిర్వహించిన సైక్లింగ్‌లో లయన్స్‌క్లబ్ సెంట్రల్ మెంటర్ నటుకుల మోహన్, జామి మణి, కరణం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## "అతివేగం" ప్రాణాంతకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

"అతివేగం" ప్రాణాంతకరమని శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ సోమవారం అన్నారు. స్థానిక పాతబస్ స్టాండ్, పొట్టి శ్రీరాములు కూడలి వద్ద, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్‌కుమార్, కార్యక్రమ చైర్మన్ జేసీ ఉర్లం శివతేజ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ మాట్లాడుతూ నగరంలో ఇటీవలి కాలంలో తరచుగా రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ నిబంధనలు ప్రతీ ఒక్కరు పాటించి, ప్రమాదాల నివారణలో భాగమవ్వాలన్నారు. గమ్యానికి తొందరగా చేరుకోవటానికి, వాహనాల్ని అతివేగంగా తీస్తూ, తాను ప్రమాదానికి గురవ్వడంతో పాటు, ప్రక్క వారి ప్రమాదాలకు కూడా కారకులై, కుటుంబ సభ్యులకు దూరమౌతున్నారన్నారు. దయచేసి వాహనాలను నిదానంగా నడుపుతూ, గమ్యానికి సురక్షితంగా చేరుకోవాలని, వాహన చోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగించాలని, వాహన సంబంధిత కాగితాలుండాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్ మాట్లాడుతూ యువతకు ట్రాఫిక్ పై అవగాహన లేక, వాహనాలను అతివేగంతో నడుపుతూ తమ ఉజ్వల భవిష్యత్‌ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారన్నారు. త్రిబుల్ రైడింగ్ వద్దని, సురక్షిత జీవితమే ముద్దని నినాదాలు చేస్తూ జేసీఐ జోన్-4 జోన్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, కోలామ్ ప్రెసిడెంట్స్ జేసీ అర్జున్, జేసీ వర్మ, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ కార్యదర్శి తమ్మినేని.ఉషారాణి, కోశాధికారి బొడిగి మధు, ఇతర సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. చింతాడ కృష్ణమోహన్, మాదవి, జేసీ జగదీష్ మరియు సభ్యులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# ఇంకెన్నాళ్లు సమ్మె పేరు చెబుతారు?



● డివిజన్‌కు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి

● ఉన్న సిబ్బందితో రోజుకో వీధికి వెళ్లినా సమస్యకు పరిష్కారం దొరుకుతుంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఎక్కువ మంది గత కొద్ది రోజులుగా సమ్మెలో ఉన్నమాట వాస్తవం. అయితే అదే సాకు చూపించి ఇంకా ఎన్నాళ్లు నగరాన్ని చీకట్లోలోకి నెట్టేస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది. విద్యుత్ దీపాలు వెలిగించాల్సిన సిబ్బంది సమ్మెలో ఉండొచ్చుగాక. అంతమాత్రాన ప్రభుత్వం వారి డిమాండ్లు అంగీకరించేవరకు వారు సమ్మెలోనే ఉంటే నగరంలో వీధి దీపాలు వెలిగించరా? అని ప్రశ్నిస్తున్నారు. కనీసం ఉన్న సిబ్బందితో రోజుకొక వీధివైపు చూసినా వెలుగులు వస్తాయి కదా? అని ప్రశ్నిస్తున్నారు. వాస్తవమే. ఉన్న సిబ్బందితో కనీసం రోజుకొక డివిజన్‌లో ఒక రోడ్డును పరిశీలించినా నగరంలో కనీసం 15 రోజులకు అన్ని వీధి దీపాలనూ వెలిగించొచ్చు. అది వదిలేసి సిబ్బంది సమ్మెలో ఉన్నారని చెప్పి తప్పించుకోవడం సరికాదని ప్రజలు అంటున్నారు. అదే పాలకవర్గం ఉండుంటే.. సంబంధిత కార్పొరేటరో, లేదా వార్డు కౌన్సిలరో దగ్గరుండి ఈ పనులు చేపట్టివుండేవారు కదా.. కార్పొరేషన్‌కు స్పెషల్ అధికారిగా ఉన్న కలెక్టర్ డివిజన్‌కు ఒక స్పెషల్ అధికారిని వేసి ఈ సమస్యకు పరిష్కారం చూపలేరా? అని అడుగుతున్నారు. అధికార పార్టీలో ఉన్న నాయకులు తమ వీధిలో దీపాలు వెలగడంలేదని ఫిర్యాదు చేస్తే మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు కార్యాలయం ప్రహరీకి ఆనుకొని టెంట్ వేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను చూపిస్తున్నారు. అదే కలెక్టర్ తలచుకుంటే జిల్లాలో వివిధ శాఖల్లో ఉన్న ఎలక్ట్రీషియన్లను తెచ్చి నగరానికి వెలుగులు పంచడం పెద్ద విషయం కాదు.



## కూటమి విజయానికి ఏడాది

- 4న పండగ చేసుకుందాం
- జనసేనపార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జనసేనపార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు కూటమి ప్రభుత్వ విజయానికి ఏడాది పూర్తవుతున్న తరుణంలో ఈ నెల 4న జనసేన పార్టీ ముఖ్యనాయకుల ఆధ్వర్యంలో సంక్రాంతి, దీపావళి కలిపి పండుగ చేసుకుందాం అనే నూతన కార్యక్రమానికి పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిందని జనసేనపార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రతీ వీరమహిళలు రంగవల్లులు వేసి కూటమి ప్రభుత్వ విజయాన్ని పండుగ చేద్దామని ఆయన అన్నారు. జగన్ పీడ విరగడై ఏడాది పేరుతో సాయంత్రం పూట దీపాలు వెలిగించి, టపాకాయలు కాల్చి పండుగ చేసుకుందామన్నారు. నియోజకవర్గాలు, గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఈ కార్యక్రమం చేద్దామని, ఫేస్‌బుక్‌లు, ట్విట్టల్ తదితర సోషల్ మీడియాలో పోస్టుచేసి కూటమి ప్రభుత్వ విజయాన్ని ప్రపంచం మొత్తం చాటి చెప్పాలని చంద్రమోహన్ పిలుపునిచ్చారు.

## మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

మహిళలకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో స్వయం ఉపాధి కల్పనలో భాగంగా బూర్జ మండలం పెద్దపేట గ్రామ సచివాలయంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కుట్టుమిషన్ల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడి, మరికొందరికి ఉపాధి ఇచ్చే విధంగా ఉండాలని మహిళలకు సూచించారు. నియోజవర్గంలో 500 మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్లకు అవకాశం కల్పిస్తుందని, పేదల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని వివరించారు. మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఇటువంటి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అనేపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ నిరంకుశ వైఖరికి, ప్రజల వ్యతిరేక కార్యక్రమాలకు నిరసనగా ఈ నెల 4న తలపెట్టబోయిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా వైకాపా మైనార్టీ విభాగ అధ్యక్షుడు ఎంఏ బేగ్, జోనల్ ఇన్‌ఛార్జి ఎంఏ రఫీ పిలుపునిచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఈ నెల 4న శ్రీకాకుళం నియోజవర్గం నాయకులు, వైకాపా రాష్ట్ర పార్టీ ఆదేశం, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపు మేరకు శ్రీకాకుళం నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో నాయకులతో జరుగు నిరసనలో పాల్గొనాలని కోరారు. స్థానిక ఏడు రోడ్ల జంక్షన్ నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు కొనసాగు ర్యాలీలో తెలుగుదేశం పార్టీ వల్ల నష్టపోయిన వివిధ వర్గాలు, ఆటో డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లు, నాయీ బ్రాహ్మణులు, చేయూత, అమ్మఒడి తదితర గత ప్రభుత్వం వల్ల లబ్ధి పొందిన వివిధ సామాజిక వర్గాలు, బడుగు, బలహీన వర్గాలు, వాలంటీర్లు, మైనార్టీ వర్గాలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

## పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సులో డైరెక్ట్ ఏజెంట్లకు దరఖాస్తులను స్వీకరణ

✦ పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌లో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సులో డైరెక్ట్ ఏజెంట్లుగా పని చేయడానికి ఎస్ఎస్‌సీ/ పదో తరగతి పాస్ అయిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు శ్రీకాకుళం పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు తెలిపారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకు దగ్గరలోని పోస్టాఫీసును సంప్రదించాలని, దరఖాస్తులు ఈ నెల 10వ తేదీలోగా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, శ్రీకాకుళం డివిజన్ -532 001 చిరునామాకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా, లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా పంపాలన్నారు. అలాగే దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్ పంపాలని తెలిపారు. పీఎల్ఐ/ఆర్‌పీఎల్ఐ ఇన్సూరెన్సు డైరెక్టర్ ఏజెంట్ కేవలం చేసిన పాలసీలపై కమీషన్ ఆధారితం మాత్రమేనని, ఇది ఎటువంటి ఉద్యోగ ప్రకటన కాదని గమనించాలని హరిబాబు ఆ ప్రకటనలో తెలిపారు.

## 27న రెడ్‌క్రాస్ జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం

- రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా శాఖ అధ్యక్షులు, రెడ్‌క్రాస్ జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం ఈ నెల 27న నిర్వహిస్తున్నట్టు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ పి.జగన్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గం.10.30లకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి రెడ్‌క్రాస్ సభ్యులు, పేట్రన్లు, వైస్ పేట్రన్లు, కమిటీ సభ్యులందరు హాజరు కావాలని కోరారు. సమావేశంలో రెడ్‌క్రాస్‌కు విరాళాలు అందజేసిన దాతలకు, రక్తదాన శిబిర నిర్వాహకులకు, నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు, రెడ్‌క్రాస్ వాలంటీర్లకు పతకాలు/ అవార్డులు ద్వారా సత్కరిస్తారని జగన్మోహనరావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఊరు మనదే దోచేయ్!

(మొదటిపేజీ తరువాయి)

శ్రీకూర్మం జంక్షన్ దాటి వెళ్లే ఆటో, కార్లు, బస్సులను రోడ్డుపై ఆపేసి దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. శ్రీకూర్మం దర్శనానికి, కర్మకాండలు నిర్వహించడానికి వచ్చే వాహనాల నుంచి పంచాయతీ గెజిట్ ప్రకారం ఆశీలు వసూలు చేయాలన్నది నిబంధన. ఇప్పుడు ఆ ఆదేశాలను పట్టుకొని కార్లు, బస్సులు, ఆటోల పార్కింగ్‌కు అవకాశమే లేకపోయినా పార్కింగ్ పేరుతో ఆశీలు వసూలు చేస్తున్నారు. దేవస్థానానికి వచ్చేవారంతా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో, అలాంటి వారి నుంచి పార్కింగ్ పేరుతో ఆశీలు వసూలు చేయాలని పంచాయతీ గెజిట్‌లో పేర్కొన్నారు. అయితే శ్రీకూర్మం వెంబడి వెళ్లే అన్నిరకాల వాహనాలకు డబ్బులు వసూలు చేసేస్తున్నారు. శ్రీకూర్మం రోడ్డు మీదుగా సుమారు 15 గ్రామాలకు రాకపోకలు సాగుతున్నాయి. ఈ గ్రామాల్లో చుట్టం చూపునకు వచ్చినా, శుభ కార్యాలకు వెళ్లినా కార్లు, ఆటోల నుంచి దౌర్జన్యంగా గెజిట్‌లో పెర్కొన్న మొత్తం కంటే రెండు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. దేవస్థానానికి తాము వెళ్లడం లేదని, చుట్టాల ఇంటికి వెళుతున్నామని, దీనికి ఆశీలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించేవారిపై ఆశీల వసూలుదారులు దురుసుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు చెబుతున్నారు.

పంచాయతీ గెజిట్ ప్రకారం ఈ ఆర్థిక సంత్సరంలో ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు శ్రీకూర్మంకు వచ్చే వాహనాలు, మార్కెట్, చిల్లర దుకాణాలు, షాపులు, గూడ్స్ నుంచి ఆశీలు వసూలుకు గ్రామానికి చెందిన లక్ష్మణరావు రూ.12.60 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. దీన్ని అదే గ్రామానికి చెందిన నగిరెడ్డి తాతారావుకు సబ్‌కాంట్రాక్ట్‌కు అప్పగించేశారు. సబ్ కాంట్రాక్ట్‌కు అప్పగించడానికి గెజిట్ ప్రకారం దక్కించుకున్న రూ.12.60 లక్షలకు అదనంగా రూ.50వేలు తీసుకున్నారు. అయినప్పటికీ ఆశీలు వసూలు మాత్రం లక్ష్మణరావు పేరుతోనే శ్రీకూర్మంలో సాగుతుంది. గెజిట్ ప్రకారం ఆటోకు రూ.10, కారుకు రూ.20, బస్సుకు రూ.50 వసూలు చేయాలి. అయితే ఆటోకు రూ.20, కారుకు రూ.50, బస్సుకు రూ.100 వసూలు చేస్తున్నారు. శ్రీకూర్మం దర్శనానికి వచ్చే వాహనాలకు మాత్రమే పార్కింగ్ చార్జీలు వసూలు చేయాలి. అలా కాకుండా రోడ్డులో వస్తే చాలు.. వాళ్లు ఎక్కడకు వెళుతున్నది పట్టించుకోకుండా రశీదు చేతిలో పెట్టి ఆశీలు వసూలు చేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాహనదారులు చెబుతున్నారు. గెజిట్ విడుదల చేసినప్పుడు మూడు కేటగిరిల్లో వాహనాలకు నిర్దేశించిన ఆశీలను మాత్రమే వసూలుచేయాలి. ఆ మేరకు ఆశీలు దక్కించుకున్నవారు గెజిట్‌కు భిన్నంగా వసూలు చేస్తున్నా పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారు. రూ.20 వసూలు చేయాల్సిన చోట రూ.50, రూ.50 వసూలు చేయాల్సిన చోట రూ.100 వసూలు చేస్తూ ఆశీలు కాంట్రాక్టర్ జేబు నింపుకుంటున్నారని గ్రామస్తులే ఆరోపిస్తున్నారు. పార్కింగ్ చేయకుండా రోడ్డుపై వాహనాలు ఆపేసి పార్కింగ్ పేరుతో వసూలు చేయడంపై శ్రీకూర్మం పరిసర ప్రాంతాలకు వచ్చే బంధువులు, స్థానికులు ఆశీలు వసూలుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2023-24 ఆర్థిక సంత్సరంలో ఆశీల పాటను రూ.11 లక్షలకు దక్కించుకున్న వ్యక్తి గెజిట్ నిబంధనల మేరకు ఆశీలు వసూలుచేసినా, గిట్టుబాటు అయిందని, ఇప్పుడు కొత్తవారు ఎందుకు ధరలు పెంచాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఆశీలపై అధిక ధరలను ముద్రించి అక్రమ వసూలుకు పాల్పడుతున్నా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అదనపు వసూలుతో పాటు శ్రీకూర్మం రోడ్డు వెంబడి వచ్చే వాహనాల నుంచి ఆశీలు వసూలు చేయడం నిలుపుదల చేయాలని వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

## ఘనంగా సీతారామా ఆలయ ప్రతిష్ట మహోత్సవం



✶ ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం

(సత్యంన్యూస్, లావేరు)

లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని నేదురుపేట గ్రామంలో శ్రీ సీతారామాలయ ప్రతిష్ఠాపనోత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా జరిగాయి. చివర రోజు సోమవారం ఘనంగా సీతారాముల కళ్యాణం, విగ్రహ ప్రతిష్ఠ, స్వామివారి ఊరేగింపు కార్యక్రమంతో ముగిసింది. ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద స్వామిజీ పర్యవేక్షణలో గ్రామ పురోహితులు పట్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో శ్రీరామ మాల దీక్షపరులతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ సీతారామ చంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగివుండి, భక్తిభావంతో ముందుకు సాగాలన్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, స్థానిక సర్పంచ్ కొల్లి ఎల్లమ్మ, ఎంపీటీసీ కృష్ణా రెడ్డి, మాజీ ఎంపీటీసీ బోర పారోతి, టీడీపీ సీనియర్ నేత బస గోవింద రెడ్డి, గాలి రమణారెడ్డి, తిరుపతి రెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.






## నిరసన కార్యక్రమం విజయవంతం కావాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 4న శ్రీకాకుళం నియోజకవర్గంలో నిర్వహించబోయే నిరసన కార్యక్రమం విజయవంతం చెయ్యాలని వైకాపా రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు మెంటాడ స్వరూప్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచనల మేరకు సోమవారం శ్రీకాకుళం నియోజకవర్గం యువజన, విద్యార్థి విభాగాలతో సమావేశం నిర్వహించి, నిర్మాణాత్మక అభివృద్ధిపై చర్చించారు. ముఖ్యంగా యువతను అన్నివిధాలుగా చైతన్యపరచటం, వైకాపా ఆలోచనా ధోరణిని వారు పూర్తిగా అర్థంచేసుకునేలా చేయడంపై చర్చించారు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని, భావజాలానికి, ఉద్దేశాలకు, ప్రజల పట్ల మన నిబద్ధతకు ప్రతీక అని అన్నారు. ఇటువంటి కార్యాచరణల ద్వారా సమాజంలో మార్పుని తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గుండ హరీష్, మేడేపల్లి భరద్వాజ్, యాళ్ల శ్రీను, గోండు భరత్, ఇషాక్ హుస్సేన్, నీలాద్రి, అల్లు అనిల్, పవన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ నాయకుల చిత్రపటాల ప్రదర్శన



(సత్యంన్యూస్, లావేరు)

లావేరు శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జాతీయ నాయకుల తైలవర్ణ చిత్రాలను విద్యార్థులతో ప్రదర్శించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు ప్రతి నాయకుని జీవిత చరిత్ర చెబుతూ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు. మహాత్మా గాంధీ, నెహ్రూ, చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, లాల్ బహుదూర్ శాస్త్రి, సుభాష్ చంద్రబోస్, బాలగంగాధర తిలక్, డాక్టర్ అంబేద్కర్‌తో పాటు మరో 20 తైలవర్ణ చిత్రాలు చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.